
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 4 మార్చి 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పల్స్‌పోలియో విజయవంతం

నెల్లూరు : జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పల్స్‌పోలియో తొలిరోజు విజయవంతమైందని కలెక్టర్ ఎం హరినారాయణ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జాకీర్ హుస్సేన్ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియోను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో సుమారు 3 లక్షల మంది పైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఈనెల 4,5 తేదీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు విధిగా తమ చిన్నారులకు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సెలీనా కుమారి, డా . మౌనిక, డా.రమేష్ డా.కుసుమ శ్రీనివాసరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్


టిడిపి కోవూరు అభ్యర్థి 'వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి'..?

బాబు వద్దకు పోలంరెడ్డి రాయబేరాలు - ఐవిఆర్ఎస్ సర్వే 'వేమిరెడ్డి'కి మొగ్గు

కోవూరు టిడిపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఇప్పటి వరకు ఆమె అభ్యర్థిత్వంపై ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ఇందులో ఆమెకు మంచి మార్కులు రావడంతో చంద్రబాబునాయుడు ఆమెకు టికెట్ ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే వేమిరెడ్డి దంపతులు కోవూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వైసిపి నేతలు, కార్యకర్తలను తమవైపు తిప్పుకోడానికి పూర్వాపరాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే తమ కుమారునికి టికెట్ ఇవ్వాలని మాజీ ఎంఎల్ఎ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చంద్రబాబు వద్ద రాయబేరాలు జరుపుతున్నట్లు సమాచారం. ఎంఎల్ఎ ప్రసన్నకుమార్‌రెడ్డికు ధీటైన అభ్యర్థిగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సరిపోడని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. నేడో, రేపో ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించనున్నారు.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. నిన్నటి వరకు కోవూరు టిడిపి టికెట్ తనకేనని, ప్రసన్న కుమార్‌రెడ్డిని ఒడిస్తానని మాట్లాడిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి టికెట్ ప్రశ్నార్థకమైంది. నల్లపరెడ్డి కుటుంబానికి కోవూరు బలమైన రాజకీయ కేంద్రం. అక్కడ నుంచి పోటీ చేసి విజయం సాధిస్తున్నారు. ఎక్కువ సార్లు విజయం సాధించారు. చంద్రబాబు నాయుడు వచ్చే ఎన్నికల్లో ప్రతి సీటు, ఓటును కీలకంగా చూస్తున్నారు. సీనియర్ నేతలను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఎవరికి టికెట్ ఇవ్వాలనే విషయమై సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా అందరి అభ్యర్థుల విషయంలో ఐవిఆర్ఎస్ సర్వే చేస్తున్నారు. " మీ నియోజకవర్గం నుంచి అభ్యర్థి నిలబెట్టాలను కుంటున్నాం,. ఒకే అయితే ఒకటి నొక్కండి.. లేదంటే నోటా నొక్కండి" అంటూ ప్రతి రోజు ఫోన్లు మోగు తున్నాయి. గతంలో కోవూరు నియోజకవర్గం నుంచి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అభ్యర్థిగా ఉండాలా ? వద్దా ? అనే సర్వేచేశారు. అందులో ఆయనకు మంచి మార్కులు రాలేదని సమాచారం. అప్పటి నుంచి కోవూరుకు మంచి అభ్యర్థి కోసం చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ సుమంత్‌రెడ్డితోనూ మాట్లాడారు. ప్రసన్న కుమార్‌రెడ్డిపై ధీటైన అభ్యర్థిని నిలబెట్టడానికి చూస్తున్న ఆయనకు వేమిరెడ్డి రూపంలో అభ్యర్థి దొరికారు. ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం టిడిపిలో చేరారు. స్వయంగా చంద్రబాబునాయుడే నెల్లూరు వచ్చారు. ఇదే సమయంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా టిడిపి కండువా కప్పు కున్నారు. వైసిపికి రాజీనామా చేసినప్పటి నుంచి ప్రశాంతిరెడ్డిని కోవూరు నుంచి పోటీ చేయాంచాలని టిడిపి పెద్దలు కోరుతున్నారు. అందుకు ప్రభాకర్‌రెడ్డి తొలుత ఒప్పుకోకపోయినా తర్వాత ఒకే చెప్పినట్లు తెలిసింది. ఇటీవల చంద్రబాబునాయుడు సర్వే బృందం కోవూరులో సర్వేచేశారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు టిడిపి అభ్యర్థిగా ఒకేనా అంటూ ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించారు. అందులో ఆమెకు భారీగా మద్దతు పలికినట్లు తెలిసింది. దీంతో బాబు వైపు నుంచి ఒకే చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సంబంధించి టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా ఒకేనా అంటూ సర్వేచేశారు. ఇదే విషయం చంద్రబాబునాయుడు సృష్టం చేశారు. మంచి మార్కులు వచ్చాయని, ఆయనే అభ్యర్థిగా ఉంటారని, భారీ విజయం సాధించాలని కోరారు. కోవూరు పై దృష్టి పెట్టడంతో ఇటీవల బుచ్చిరెడ్డి పాళెంకు చెందిన యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం నాయుడును పార్టీలోకి తెచ్చు కున్నారు. మరికొందరి నాయకులను విపిఆర్ తమ వైపు తిప్పుకోడానికి ఎత్తుగడలు వేస్తున్నారు. ఇదిలా ఉంటే టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు, సీరియర్ రాజకీయవేత్త, పార్టీకి పెద్దగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకర్గంలోనూ సర్వే నిర్వహించారు. తొలుత చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసు లురెడ్డిల పేర్లపై సర్వేపల్లిలో మూడు సార్లు ఐవిఆర్ఎస్ సర్వే చేయించారు. ఇప్పటి వరకు సర్వేపల్లి టికెట్ విషయంలో సృష్టత ఇవ్వలేదు. జిల్లాలో పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్న సోమిరెడ్డిపై సర్వేచేయడం పట్ల ఆ పార్టీనేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంత పెద్ద సీనియర్ నేతకే ఇలాంటి పరిస్థితి ఉంటే పోలంరెడ్డి దినేష్‌రెడ్డి గురించి పెద్దగా ఆలోచిం చాల్సిన అవసరం లేదని ఆపార్టీ నేతలం టున్నారు. రాజకీయాల్లో ఏది ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియదు. ఏం జరుగుతుందో చూడాలి.


వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి




చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన ప్రశాంతిరెడ్డి

'వేమిరెడ్డి' వల్ల వైసిపికి నష్టం ఏమీ లేదు..!

పదికి పది స్థానాలు గెలుస్తున్నాం : మంత్రి 'కాకాణి'

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపిలో చేరడం వల్ల తమ పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నెల్లూరు వచ్చి తన ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. నెల్లూరులో తంతే మూడు జిల్లాల అవతల పడ్డారని మాట్లాడడం ఏమిటన్నారు. తన సొంత నియోజకవర్గం చంద్రగిరి వదిలి కుప్పం చంద్రబాబు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. వేమిరెడ్డి వెళ్లారని, ప్రజలు తమ పార్టీతోనే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో పదికి పది స్థానాలు వైసిపి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు ఎంపి అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని నియ మించారని, తప్పక విజయం సాధిస్తారన్నారు. టిడిపి, జనసేన పొత్తువల్ల ఏమి ఉపయోగం లేదన్నారు. ఇద్దరు బలహీనులు కలిస్తే..బలహీనులే అవుతారన్నారు. టిడిపికి పోటీ చేయడానికి కనీసం అభ్యర్థులు దొరకలేదని, ఇప్పుడు అభ్యర్థులు దొరికితే ప్రజలు మద్దతు పలికినట్లు అన్నారు. మరోసారి ప్రజలకు సేవచేయడానికి సిద్ధమని ముఖ్యమంత్రి చెబుతుంటే చంద్రబాబు దానిని మరో అర్థం చెబుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు ఎలా ఎగ్గొట్టాలో చూపించడానికి సంసిద్ధం అంటున్నావా బాబూ? అన్నారు. జగన్ మోహన్ రెడ్డి పేరు ఎత్తే కనీస అర్హత చంద్రబాబుకు ఉందా అన్నారు. చంద్రబాబూ...నోరు అదుపులో పెట్టుకో..ఎదంటే అది మాట్లాడితే సహించేది లేదన్నారు. టిడిపిలో చేరికల కార్యక్రమం అని శనివారం నెల్లూరుకు వచ్చిన చంద్రబాబు ఆ వేదికగా అనేక విమర్శలు చేశారన్నారు. ఎంతో అనుభవం, పరిణితితో చంద్రబాబు మాట్లాడతారని ఆశిస్తారని, చంద్రబాబు చాలా దిగ జారిపోయారని ఆయన ప్రసంగంలో ఫ్రస్టేషన్ కనిపిందన్నారు. నాయకుల చేరికలతో టిడిపి బలపడిందని చంద్రబాబు అంటున్నారన్నారు. టిడిపి నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చేది వైసిపి ప్రభుత్వమేనన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

తారకేశ్వరస్వామి ఆలయంలో 'విపిఆర్' పూజలు

ప్రజాశక్తి -నెల్లూరు సిటి :రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం, ముదివర్తి గ్రామంలోఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత తారకేశ్వరస్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న వి.పి.ఆర్ గ్రామస్థులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్థులు కామాక్షిదేవి అమ్మవారి ఆలయాన్ని పునఃనిర్మించి ఆదివారం కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారికి వేద పండితులు, అర్చకులు.. మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వి.పి. ఆర్‌తారకేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. టిడిపి నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ఆలయ పునఃనిర్మాణ దాత మల్లికార్జున రెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ రఫీ, ఉప సర్పంచి శరత్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


తారకేశ్వరస్వామి దేవాలయంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

-మానుగుంట, తూమాటి మద్దతు ఉంది..

-ఎంఎల్ఎ బుర్రా మధుసూదన్ యాదవ్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు రాజీలేకుండా కషి చేస్తానని కనిగిరి ఎంఎల్ఏ, కందుకూరు వైసిపి సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ చెప్పారు. టిడిపి హయాంలో కందుకూరులో ఎమిజరిగిందో అందరికి తెలుసన్నారు ఆదివారం ఆలా వారి కళ్యాణ మండపంలో పాత్రికేయుల ఆత్మీయ సమావేశంలో బుర్రా మాట్లా డారు. కందుకూరు వైసిపి టికెట్ బీసీనైన తనకు కేటాయించిన జగన్మోహన్ రెడ్డికి బుర్రా ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ మేధావి, సీనియర్ నాయకులు ఎంఎల్ఏ మాన ుగుంట మహీధర్ రెడ్డి ఆశీస్సులతో, తన మిత్రుడు తూమాటి మాధవరావు సహకారంతో తాను కందుకూరు ఎంఎల్ఏగా పోటీలో ఉన్నట్లు తెలిపారు. కందుకూరు ప్రజలు తనను ఆశీర్వ దించాల న్నారు. కందుకూరును ఇతోధికంగా అభివద్ధి చేయడానికి కషి చేస్తానని బుర్ర మధుసూదన్ యాదవ్ తెలిపారు. రామాయపట్నం పోర్టు వల్ల 10 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయన్నారు. త్వరలో విమానాశ్రయం కూడా నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో టిడిపి కందుకూరు ప్రజలను భయబ్రా ంతులకు గురి చేసిందన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకొని ప్రజలు విజ్ఞతతో వైసిపికి ఓటు వేయాలని కోరారు. కనిగిరిలో తాను అందరికి మంచి చేశాన న్నారు.కందుకూరు తన సొంత నియోజక వర్గమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, న్యాయవాది ముప్పవరపు కిషోర్ ఉన్నారు.


మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు : కారు ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మండలంలోనిగుడ్లూరు తెట్టు మధ్యలో పొట్లూరు దగ్గర ఆదివారం ప్రమాదం జరిగింది. మండలంలోని చిమిడిదిపాడు గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో వెళ్తున్నారు. కంద కూరు నుంచి గుడ్లూరు మీదుగా కావలికి వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటలో ఆటో బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న చిన్న కొండయ్య, మాలి అనే ఇద్దరి కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బి.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా పి.వి.ఎస్.టి రాంప్రసాద్ ఎన్నిక య్యారు. ఆదివారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఎపిజిఈఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నిక కార్యక్ర మానికి అధికారిగా రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి జి.నాగసాయి, ఎన్నికల పరిశీల కులుగా రాష్ట్ర కార్యదర్శి శ్రీని వాసులరెడ్డి వ్యవహ రించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి ఒకే ప్యానెల్ నామినేషన్లు వేయడంతో జిల్లా సభ్యుల సమక్షంలో ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనం తరం జిల్లా అధ్యక్షునిగా బి సుధాకర రెడ్డి (వైద్య ఆరోగ్య శాఖ) , కార్యదర్శిగా పి.వి.ఎస్.టి రాంప్రసాద్, (అర్థ గణాంక శాఖ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నాగసాయి ప్రకటిం చారు. ఇంకా సహాధ్యక్షులుగా డాక్టర్ సి అమరేంద్రనాథ్ రెడ్డి, కార్యని ర్వాహక కార్యదర్శిగా ఎస్ చక్రవర్తి, జ్యూడిషియల్ శాఖ కోశాధికారిగా ఎమ్ సురేష్, నీటిపారుదల శాఖ ఎన్నికయ్యారు. అలాగే పలుశాఖల నుండి ఏడుమందిని ఉపాధ్యక్షులుగా, మరో ఏడు మంది సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. మాజీ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు వై రమణారెడ్డి, వై మల్లికార్జున లను నూతన కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ఎపిజిఈఎ రాష్ట్ర సలహా సంఘం చైర్మన్ చొప్పా రవీంద్రబాబు నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ సందేశం పంపారు.


బి.సుధాకర్‌రెడ్డి (అధ్యక్షులు)


పి.వి.ఎస్.టి రాంప్రసాద్ (కార్యదర్శి)

విద్యారంగ సంస్కరణలపై

శ్వేతపత్రం విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా..? ప్రభుత్వ పాఠశాల్లోవిద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుంది తదితర అంశాలపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా నాయకులు వి.వి.శేషులు అధ్యక్షత వహించారు. ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండేళ్ల కిందట విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందిస్తామని, అంతర్జాతీయ విద్యార్థిగా తయారు చేయటం లక్ష్యంతో విద్యారంగ సంస్కరణలు ప్రవేశపెట్టినట్టు ప్రభుత్వం ప్రకటిం చిందన్నారు. ఆచరణలో ఆ లక్ష్యం వైపు ఈ సంస్కరణలు ఉన్నాయా లేదా అన్న అంశంపై ప్రభుత్వం నేటి వరకు సమీక్షలు నిర్వహించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం చదివే విద్యార్థుల కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుం దన్నారు. 14వేలు ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయాలతో నడుస్తున్నాయన్నారు. ఇక్కడ చదువుకొనే వారికి నాణ్యమైన విద్య అందించ బడుతుందా అని ప్రశ్నించారు. సిబిఎస్ఇ సిలబస్ 1000 పాఠశాలలో ప్రవేశపెట్టినప్పటికీ, ఆ పాఠశాలల్లో టోఫెల్, బై జూస్, ఇప్పుడు ఐబిసిలబస్ పేర్లతో ఒకదానివెంట మరొకటి ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. 4,600 ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను స్థానికంగా ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని, ఆ విద్యార్థులకు ఎలాంటి విద్య అందుతుందో నేటి వరకు సమీక్ష లేకపోవడం సరికాదన్నారు. గత ఏడాది 294 పాఠశాలలో ప్లస్ 2 ప్రవేశ పెట్టారని, ఎంత మంది విద్యార్థులు చేరారు.. ఎంత మంది ఉత్తీర్ణత సాధించారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో 210 అదనంగా ప్లస్2 స్కూల్స్ గా మార్చ బోతునట్లు ప్రభుత్వం ప్రకటన చేయడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపిస్ నినాదంతో ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కార్యక్రమాలను ఉద్యోగ,ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీలు వారి మానిపెస్ట్ లో పాతపెన్షన్ ఇస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చలపతి శర్మ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళదినోత్సవాన్ని ప్రజాసంఘాలతో కలిపి మార్చి9 వతేది ననగరంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏం సి అచ్చయ్య, కోశాధికారి మురళీధర్ రావు,జిల్లా కార్యదర్శులు కె నాగిరెడ్డి, గంగాధర్, తిరుపతయ్య, ఖాజావలి, సురేంద్రబాబు, రవిబాబు, బాలరాగయ్య, ఎన్ మధుసూదనరావు, సుభాషిని, మాధవరావు ,కె వెంకటేశ్వర్లు, పి వెంకటేశ్వర్లు , ఈ.వి.నారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

జగన్ ఆర్థిక నేరస్థుడు.. అందుకే జైలుకెళ్లాడు..!

ఫ్యాక్టరీ లేకుండా ఆదాయం ఎలా వచ్చింది.. - టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక నేరస్థుడు కాబట్టే జైలుకు వెళ్లాడని టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందే ఆర్థిక నేరాలకు పాల్పడ్డారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, భారతీరెడ్డి నకిలీ ఫ్యాక్టరీ పేరుతో మోసం చేశారన్నారు. సరస్వతి ఫవర్ ప్రాజెక్టు పేరుతో 1999లో కోటి రూపాయాలు షేర్ క్యాపిటల్‌తో ప్రారంభించారన్నారు.2009లో రూ 35 కోట్లు షేర్ క్యాపిటల్ చూపంచారన్నారు. 2009లో వైఎస్ జగన్ రూ 87 లక్షలు, వైఎస్ భారతి రూ 80 లక్షలు పెట్టుబడి పెడితే 2009 సెప్టెంబర్‌లో జగన్ షేర్ రూ 18.87 కోట్లు, వైఎస్ భారతి రూ 18 కోట్లకు కు కేవలం రెండు నెలల్లో ఎలా పెరిగాయని ప్రశ్నించారు. ఇది ఎలా సాధ్యమైంయిందని ప్రశ్నించారు. సరస్వతి పవర్ ప్రాజెక్టు పేరుతో కనీసం గుడెస కూడా లేదని, అసలు ఫ్యాక్టరీ లేదన్నారు. అందుకే ఆయన ఆర్థిక నేరస్తుడుని జైలుకు పంపారన్నారు. 2009 ఏప్రిల్16 ఎన్నికల జరిగాయని, మే 16న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రెండు రోజుల్లో జిఒ నెంబర్ 107 విడుదల చేశారన్నారు. మైనింగ్ పర్మిషన్ తీసుకున్నారన్నారు. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం 1015 ఎకరాలు సిమెంట్ ఫ్యాకరీల కోసం కేటాయించారన్నారు. ఇందులో రాయల్టీ కేవలం రూ. ఐదు రూపాయాలు మాత్రమేనని,ప్రభుత్వ పన్ను రూ 3 రూపాయాలని, హెక్టర్‌కు రూ 200 ప్రభుత్వం వసూలు చేసందని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి కాక ముందే పేదల భూములు తీసు కున్నారన్నారు. ప్రభుత్వం నుంచి భూములు తీసుకొని ఉపయోగించలేదని, వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం రాష్ట్రంలోని అనేకు పరిశ్రమలకు కేటాయించిన భూములను తిరిగి తీసుకున్నారని గుర్తు చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆనం వెంకట రమణారెడ్డి

'జగనన్న భూ రక్ష'లో అక్రమాలు : సోమిరెడ్డి

ప్రజాశక్తి -పొదలకూరు

భారీ అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకున్న జగనన్న భూ రీసర్వేను టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలంలోని దుగ్గుంట పెద రాజుపాళెం, కొత్తకంబాలపల్లి గ్రామాలలో ఆదివారంపోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ,సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బాబు షఉరిటీ - భవిష్యత్తు గ్యారంటీ, బాబు సూపర్ - 6 పథకాలు గురించి ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి వర్యులు చంద్రమోహన్ రెడ్డి గారు, టిడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. అనంతరం కొత్తకం బాలపల్లిలో ఏర్పటు చేసిన సభలో ఆయన మాటా ్లడుతూ జగనన్న భూరక్ష పథకం కాదని జగనన్న భూభక్ష పథకమని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, కోడూరు పెంచల బాస్కర్ రెడ్డి,పులిపాటి వెంకటరత్నం నాయుడు, చిరుమావిళ్ళ సత్యనారాయణ, యన్ వెంకటేశ్వర్లు నాయుడు, ఈత ముక్కల బాబు నాయుడు, దేవినేని శరత్, , పొడపాటి శరత్ నాయుడు, సాగిరాజు వెంకటేశ్వర్లు రాజు, అక్కం విజయభాస్కర్ రెడ్డి, ఉప్పు రాము, కొండూరు అంకయ్య, ముప్పాళ్ళ మనోహర్, ముప్పాళ్ళు నరసింహ, సాగిరాజు భారత్, పల్ల శంకరయ్య, చల్ల నాగయ్య ఉన్నారు.




'ఇంటూరి' ముమ్మర ప్రచారం..!

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పట్టణంలో నిరంతరంగా కొనసాగిస్తున్న బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజాదరణ లభిస్తోంది. ఆదివారం 31వ వార్డు కోవూరు రోడ్డులోని సాయి నగర్ లో ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంచారు. జగన్ పాలనలో ఉద్యోగాలు లేవు, పరిశ్రమలు రావు.. ఆదాయం సష్టించడం చేతగాక, అప్పులు తెచ్చి బండి లాగిస్తున్నారని విమర్శించారు. ఏడాదిన్నర కిందట ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే దిక్కులేదు. ఆ నిధులు తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారు. దాదాపు 75 కోట్లకు జగన్ హామీలు ఇచ్చి, కందుకూరు జనాన్ని మోసం చేశారు. అలాంటప్పుడు వైసిపికి మరోసారి ఎందుకు ఓటు వేయాలో ప్రజలే ఆలోచించాలని నాగేశ్వరరావు కోరారు. కందుకూరు నియోజకవర్గంలో నిజమైన అభివద్ధి, సంక్షేమం అంటే ఎలా ఉంటుందో చేతల్లో చూపిస్తాను. నన్ను మీ బిడ్డగా ఆశీర్వదించాలని ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు అత్తంటి శివకష్ణ, చుంచు వేణు, గుమ్మల్ల మాల్యాద్రి, జమ్ము వెంకట చైతన్య, నాటకం శంకర్, సవిడిపోయిన వెంకటకష్ణ, పీలా శ్రీనివాసులు, సవిడిబోయిన సాయి, రావెళ్ల వెంకటేశ్వర్లు, పంది యానాది నాయకులు చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు వేణు, చుండూరి శ్రీనివాసులు, షేక్ సలాం, షేక్ రూబీ, పులి నాగరాజు, ముప్పవరపు వేణు, షేక్ మమ్ముషా, మచ్చ మనోహర్, గుమ్మ శివ, ఓరుగంటి రామ్మూర్తి, గొల్లప్రోలు కొండలు, శేఖర్ లింగాబత్తిన మాల్యాద్రి ఉన్నారు.



అచేతన స్థితిలో గిరిజన మహిళ

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు బస్టాండ్ సెంటర్లో వద్దనున్న బస్సు షెల్టరులో ఓ మహిళ అచేతనంగా పడి ఉండడాన్ని పలువురు ప్రయాణికులు గమనించారు. ఉలుకు పలుకు లేని ఆ మహిళ ముక్కుతో మూలుగుతూ ఆచేతనంగా పడిపోయి ఉంది. స్థానికుల్ని ప్రశ్నించగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆటోలో తీసుకొచ్చి షెల్టరులో వడవేసి వెళ్లిపోయాడని తెలిపారు. గమనించిన స్థానికులు కొందరు నీరు, ఆహారం అందించటంతో రెండు రోజులకి కోలుకొంది. లేచి కూర్చోలేని పరిస్థితిలో మాట్లాడింది. నెల్లూరుకు చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఆ మహిళను ఓ వ్యక్తి బాతులు దగ్గర కాపులా కసం తీసుకెళ్లాడు. తిరిగి పంపిం చకపోవడంతో కూలీ డబ్బులు ఇస్తే వెళ్లిపోతానని చెప్పడంతో ఆగ్రహం చెందిన ఆ బాతుల వ్యాపారి ఆమెను ఓ గదిలో బంధించి తిండి పెట్టకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టాడని, ఆసుపత్రిలో వైద్యం చేయిస్తానని నమ్మబలికి ఆటోలో వేసుకుని గుడ్లూరు బస్సు షెల్టర్లు వద్ద వదిలేసి వెళ్లిపోయాడని ఆమె వాపోయింది. తన పేరు శ్రావణి అని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త వదిలేసి వెళ్లి పోయాడని తెలిపింది. 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


అచేనస్థితిలో పడి ఉన్న మహిళ

'ఆక్స్‌ఫర్డ్'లో వీడ్కోలు సభ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని పామూరు రోడ్డులో వున్న బి.అర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం పదో తరగతి విద్యార్థులు వైభవంగా జరిగింది. విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేటర్ శంకర్ విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులకు సలహాలు సూచనలు తెలిపారు. బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు, కరస్పాండెంట్ బండి వెంకటే శ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్క రరావు, బి నరేంద్ర బాబు, పాఠశాల డీన్ రామారావు, ప్రిన్సిపాల్ మల్లికార్జున, నజీర్, సునీత తదితర ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



వలంటీర్లకు వందనం



ప్రజాశక్తి-కావలి : ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసంలో ఆదివారం బోగోలు మండలానికి చెందిన వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. అత్యుత్తమ సేవలు కనబరిచిన వలంటీర్లకు ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివి అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వానికి మిగతా రెండు వారధులుగా పనిచేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కావలి నియోజకవర్గంలో సేవాభావంతో వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. అటువంటివారిని అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ చేస్తున్న కృషి మరువలేమని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, బోగోలు వైసిపి ప్రెసిడెంట్ మద్దిబోయిన వీరరఘు, నాయకులు సుంకే మాల్యాద్రి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి భారీ చేరికలు



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని 10వ వార్డు, 11వ వార్డుల నుండి భారీ స్థాయిలో ఆదివారం వైసిపి నుండి టిడిపిలోకి చేరికలు జరిగాయి. కావలి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 11వ వార్డు వైసిపి మాజీ కౌన్సిలర్ మొలతాటి శేషమ్మ, ఎస్‌సి ఫిషర్ మెన్ సొసైటీ చైర్మన్, అడ్వకేట్ ఎల్లంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కావలి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్ సమక్షంలో బొడ్డు వెంకటనారాయణ, మొలతాటి మనోహర్, మార్పుడి మాచర్ల, పిసి రామారావు, తదితరులు పెద్ద ఎత్తున వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తనను నమ్మి ఊళ్లకు ఊళ్ళు, వార్డులకు వార్డుల ప్రజలు మద్దతు తెలపడమే కాకుండా, వెంట నడుస్తామంటూ టిడిపిలో చేరి ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చి తనను గెలిపించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలియజేశారు. అభివృద్ధి కుంటుపడిన కావలిలో అభివృద్ధి చేసి చూపెడతానని, తనను నమ్మి వచ్చిన ప్రతిఒక్కరీ రుణం తీర్చుకుంటానన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ అభివృద్ధి చేయగల, మాట మీద నిలబడే నమ్మకమైన వ్యక్తి కావ్య క్రిష్ణారెడ్డి అని, కావలి బాగుపడాలంటే, కావలిలో ప్రశాంత వాతావరణం రావాలంటే, దోపిడీలు, ఆరాచ కాలకు అడ్డుకట్ట పడాలంటే ఎంఎల్‌ఎగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపిలోకి వలసలు

ప్రజాశక్తి-కావలి: ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలో ఆదివారం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీతో పాటు వారి సతీమణి అనురాధ, కుమారుడు విప్లవ్, పత్రి అశోక్, మాధవ్, శాంతి, సుబ్బారావు, చక్రి, సుమంత్, అభిలాష్, అరుణ్, సోము, తో పాటు సుమారు 200 కుటుంబాలు మహిళలు యువత భారీ ఎత్తున వైసిపిలో చేరారు. ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. పథకాలే కాకుండా అంబేద్కర్ వారసులను గౌరవించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల ఎత్తు అంబేద్కర్ విగ్రహాన్ని భావితరాలకు గుర్తుండే విధంగా విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైసిపికి పట్టుకొమ్మలాంటి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు ఏకతాటిపై జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. తమకు వెన్నుదన్నుగా ప్రోత్సహించే ప్రముఖ రియల్టర్ వేమూరు రాజేంద్ర ప్రసాద్ వైసిపి సీనియర్ లీడర్ షేక్ షాహుల్‌హమీద్ ఆధ్వర్యంలో తమ ప్రాంతవాసులైన ఆత్మకూరు రాజేష్, కుందుర్తి కామయ్య, చేవూరి కిరణ్ సహకారంతో పార్టీకి కష్టపడి పని చేస్తామని రాబోయే ఎన్నికల్లో ప్రతాప్ అన్నను మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిపించు కొని మంత్రిని చేసుకునేందుకు తామందరం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం



ప్రజాశక్తి-మర్రిపాడు : బ్రాహ్మణపల్లిలో ఎంఎల్‌ఎ నివాసంలో నందవరం గ్రామానికి చెందిన శివాలయం కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డిని కలిశారు. గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించి ప్రారంభించిన విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంఎల్‌ఎ రూ.5లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాశక్తి-ఉదయగిరి : కుర్రపల్లిలో మృతి చెందిన కుటుంబానికి శకునాల పల్లి ఉపసర్పంచ్ రేఖలగుంట పద్మ రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆదివారం మండల పరిధిలోని శకునాల పల్లి పంచాయతీ కుర్రపల్లి బిసి కాలనీలో కేన్సర్‌తో శనివారం మృతి చెందిన తిరుపతి రాజా (38) కుటుంబానికి పంచాయతీ ఉపసర్పంచ్ రేఖలగుంట పద్మ రూ.10వేల ఆర్థికసాయం చేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్ వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'బిఎంఆర్' సహకారంతో అన్నదానం



ప్రజాశక్తి-కావలి : స్థానిక తుపాన్ నగర్లోని నందు సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం ఆ సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థసభ్యులు ఎమ్ అజిత్ బాబు, షేక్ ఖాదర్ భాషా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంయుక్త సేవాసంస్థ [illegible] ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఎమ్ అజిత్ బాబు మాట్లాడుతూ [illegible] బీద మస్తాన్ రావు [illegible] పిల్లలకు మంచి భోజనం పెట్టమని సంస్థ అధ్యక్షుడు సురేంద్రకు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. బీద మస్తాన్‌రావు [illegible] ఆయురారోగ్యాలతో, మరెన్నో పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు.


వాహనాల మరమ్మతులకు శ్రీకారం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజలుల్లా శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మూలన పడి ఉన్న వాహనాల మరమ్మతులు చేసి వాటిని ఉపయోగించుకునేలా సన్నద్ధమయ్యారు. చిన్న జెసిబిని రిపేర్ చేయించేందుకు గుంటూరు నుంచి మెకానిక్‌ను పిలిపించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఫజలుల్లా మాట్లాడుతూ గత ఏడాది నుండి మూలనపడ్డ చిన్న జెసిబిని రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి చిన్నచిన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పట్టణంలో పిచ్చి మొక్కలు తొలగించేందుకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం [illegible] వచ్చే ప్రజా ప్రతినిధులు, అర్జీదారుల కోసం ఒక షెడ్డును ఏర్పాటు చేయడం [illegible] ఉన్నారు.

సోలార్ విద్యుత్‌తో లాభదాయకం

- సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్



ప్రజాశక్తి-నెల్లూరు

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుడి నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేసే సమయంలో రకరకాల ఛార్జీల పేర్లుతో నగదు వసూలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుంది. ఆ భారం నుంచి విద్యుత్ వినియోగదారులకు విముక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన' అనే కొత్త పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధం అయింది. జిల్లా ప్రజలు ఆ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి.. ఎంత ఖర్చు అవుతుంది.. ప్రభుత్వం ఎంత మేరకు సబ్సిడీ అందజేస్తుందో సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ మాటల్లో...

ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన' పథకం జిల్లాలో అమలు చేస్తున్నారా.. ప్రభుత్వం సబ్సిడీ ఎంత మొత్తం అందజేస్తుంది. సౌర విద్యుత్ ఎన్ని యూనిట్లు ఉచితంగా వినియోగించుకోవచ్చు..?

జవాబు. కేంద్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ యోజన పేరుతో రూ.75.021 కోట్ల నిధులతో సరికత్త పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ పథకంలో ఇళ్లపై సౌరశక్తి ఫలకాలు అమర్చుకొనేందుకు ఉత్సాహం ఉన్న వారికి, విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని బట్టి ఇంటికి రూ.30వేల నుంచి రూ.78వేల వరకు సబ్సీడీ ఇస్తుంది. అదే సమయంలో సౌరశక్తి ఫలకాల నుంచి ఉత్పాదన అయిన విద్యుత్తులో నెలకు 300 యూనిట్లు వరకు ఉచితంగా వినియోగించుకోవచ్చు. మిగిలిన విద్యుత్తు ప్రభుత్వం తీసుకుంటుంది. కోటి ఇళ్లకు లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన ఈ పథకం అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం ద్వారా గృహాలకు విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 150 యూనిట్లు ఉన్నవారు ఒక కిలో వాట్ నుంచి రెండు కిలో వాట్ వరకు సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ కెపాసిటీ పెట్టుకున్నట్లయితే వారికి రూ.30వేల నుంచి రూ.60 వేల వరకు సబ్సిడీగా అందజేస్తారు. 150 నుంచి 300 యూనిట్లు విద్యుత్ వినియోగం గలవారు రెండు నుండి మూడు కిలోమీటర్ల సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ కెపాసిటీ పెట్టుకున్నచో రూ.60 వేల నుండి రూ.78 వేల వరకు సబ్సిడీ పొందవచ్చు.

ప్రశ్న . పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలీ యోజన పథకంలో లబ్ధి పొందాలంటే దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి.. దరఖాస్తుతోపాటు ఏయే పత్రాలు జత చేయాల్సి ఉంటుంది..?

జవాబు. ఆసక్తి కలిగిన ప్రజలు తమ దరఖాస్తును ప్లే స్టోర్ లో అందుబాటులో ఉన్న PM-SURYAGHAR, QRTPM SURYAGHAR అను రెండు రకాల యాప్స్‌లో ఏదో ఒక డౌన్‌లోడ్ చేసుకోని దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు తోపాటు ఆరు నెలల విద్యుత్ బిల్లులను జత చేయాలి. ఈ పథకం వ్యక్తిగత నివాస, సమూహ గృహ కామన్ సర్వీసులకు వర్తిస్తుంది. దరఖాస్తు సమర్పించి డిస్కం క్లియరెన్స్ పొందిన తర్వాత వినియోగ దారులు నమోదు చేసుకున్న విక్రేతల నుండి సోలార్ ప్లాంట్‌ను ఇన్ స్టాల్ చేసుకోవాలి. పని పూర్తయిన తర్వాత వినియోగదారుడు నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నెట్ మీటర్ అమర్చిన తర్వాత వినియోగ దారుడు పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్లోడ్ చేసుకోవాలి. సబ్సిడీ 30 రోజుల్లోగా చెల్లించబడుతుంది. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి అవసర మైన సుమారుగా పైకప్పు మీద 10 చదరపు మీటర్లు స్థలం ఉండాలి. ఒక కిలోవాటు రూఫ్ టాప్ కెపాసిటీ కోసం సుమారు మూడు నుండి నాలుగు ప్యానెల్లు ఒక మీటర్ వెడల్పు 1.6 మీటర్స్ ఎత్తు కొలతలతో అమర్చబడతాయి. వినియోగ దారులు పైకప్పు పటిష్టతను ధృవీకరించాలి. పై కప్పుపై చెట్ల లేదా భవనాలు ఛాయలు పడుతున్నాయో లేదో తనిఖీ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలి.

ముఖాముఖి

ప్రశ్న. ఈ పథకం వినియోగించుకోవడం ద్వారా వినియోగదారులకు ఏమేరకు ఉపయోగం ఉంటుంది..?

జవాబు : ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 125 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి వినియోగదారుడు డిస్కామ్ నుండి కనీస విద్యుత్ బిల్లును పొందుతారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటాయి. రూఫ్ టాప్ ప్యానెల్ చుట్టూ చల్లటి గాలి ఉంటుంది. వినియోగదారుడు ఐదు సంవత్సరాలు నుండి ఆరు సంవత్సరాల లోపల మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు.

ఒపిఎస్‌ను అమలు చేసే వారికే మద్దతు



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేసే వారికే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు రాజకీయ పార్టీల నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలను ఛిద్రం చేసే సిపిస్ విధానం 2004 నుండి అమలులోకి వచ్చి ఉద్యోగులు పాలిట శరాఘాతం అయిందన్నారు. దానిని రద్దుచేసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తెస్తానని పాదయాత్ర సందర్భంగా అధికార పక్ష ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీనిచ్చి దానిని రద్దు చేయకపోగా మరింతగా ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలిగించే జిపిఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. దానిని ఏమాత్రం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించక పోయిన ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. యుటిఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు ఎవరైతే సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని తీసుకువస్తారో అటువంటి వారికే తమ మద్దతు ఉంటుందని రాబోయే ఎలక్షన్లలో అటువంటి వారికే తమ ఓటు ప్రాధాన్యత ఉంటుందని నిర్ణయించిందని తెలియజేశారు. ఈ మేరకు మండలంలోని టిడిపి నాయకులు చంద్రారెడ్డి, గౌస్‌బాషా, ఇతర టిడిపి నాయకులకు, జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, సిపిఎం నాయకులు డేవిడ్ రాజు, లక్ష్మీపతిలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్, మాజీ జిల్లా కార్యదర్శి బి.శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, గౌరవాధ్యక్షులు హరికృష్ణ, ఎస్.మురళీ కృష్ణ, పిఎన్.మస్తాన్, ఖలీల్ అహమద్, షఫీ, పి.పెంచలయ్య, శ్రీరాములు, నజీర్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కాకర్ల'ను కలిసిన జనసేన, టిడిపి నాయకులు



అభ్యర్థి కాకర్ల సురేష్‌తో టిడిపి జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి : తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను నియోజకవర్గ జనసేన, టిడిపి నాయకులు కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆదివారం వింజమూరు మండలంలోని బొమ్మరాజు చెరువు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల చారిటబుల్ వ్యవస్థాపకు కాకర్ల సురేష్‌ను 8 మండలాల టిడిపి నాయకులు అధిక సంఖ్యలో కలిశారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని జనసేన నాయకులు కొల్లు అన్వేష్, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, ఆకుల వెంకట్, పఠాన్ రసూల్, గుండబత్తిన రామ్మూర్తి కాకర్లను మర్యాపూర్వకంగా కలిసి జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై చేపట్టవలసిన కార్యక్రమాలపై సుదీర్ఘ చర్చ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు ఆదేశాల మేరకు తమ జనసేన పార్టీ పూర్తి సహాయ సహకారాలు అందించి నియోజకవర్గంలో మీ గెలుపును రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ఎల్లవేళలా వెంట ఉంటాయని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

జగనన్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా అవాస్తవ ఆరోపణలు, దుష్ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వైసిపి సోషల్ మీడియా సభ్యులుగా ఈ ఆరోపణలను, దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టి జగనన్న సంక్షేమాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలియజేయాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సోషల్ మీడియా సభ్యులకు సూచించారు. బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా చేసుకుని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా సమాజంలో జరుగుతున్న మంచి చెడులను ప్రజలకు తెలపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం అందచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్ష పార్టీలు బురదజల్లేందుకు చేస్తున్ ప్రయత్నాలన్నింటినీ తిప్పి కొట్టాలని, అదేవిధంగా మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు సోషల్ మీడియా వేదికల ద్వారా తెలియ జేయాలన్నారు. గ్రామంలో ఉండే వైసిపి సోషల్ మీడియా సభ్యులు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచార బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహించాలని, గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను తమ దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం : పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఆత్మకూరులో అనంతసాగరం గ్రామసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సులు జరుగుతాయని ఆదివారం ఎంపిడిఒ తాజ్‌మస్రూర్ తెలిపారు. మండల ప్రజా పరిషత్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయన్నారు.

టిడిపి అభ్యర్థి విజయానికి కృషి

ప్రజాశక్తి-కావలి

కావలి తెలుగుదేశం పార్టీ- జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి శనివారం రాత్రి జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. జనసేన కావలి ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అళహరి సుధాకర్ కావ్య క్రిష్ణారెడ్డిని ఆప్యాయంగా పలకరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల ప్రణాళికపై ఇరువురు కాసేపు చర్చించారు. కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు టికెట్ లభించిన అనంతరం జనసేన ఇన్‌ఛార్జిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. కావలిలో టిడిపి - జనసేన అభ్యర్థిగా నియమించిన టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి, జనసేన నాయకులు కలిసి పనిచేసే విధంగా, జనసేన ఇన్‌ఛార్జి సూచనలు పాటిస్తూ పని చేయడం జరుగుతుందన్నారు. టిడిపి - జనసేన ఒక్కటే అనే విధంగా కలిసి పని చేస్తామని తెలిపారు. అళహరి సుధాకర్ మాట్లాడుతూ టిడిపి - జనసేన ఉమ్మడి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అళహరి సుధాకర్



పట్టాలు అందజేస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని కృష్ణంపల్లి పంచాయతీలో అర్హులైన అబ్ధిదారులకు జగనన్న భూహక్కు పత్రాలు పట్టాలను సర్పంచ్ అక్కి ప్రమీల, అక్కి భాస్కర్ రెడ్డి పంపిణీ చేశారు. మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు పేదలందరికీ ఇళ్ల స్థలాల భూహక్కు పత్రాలను ప్రభుత్వ ఆదేశాలు ఎంపిడిఒ సూచనల మేరకే విఆర్ఒ సమక్షంలో లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని లబ్ధిదారుల సొంతింటి కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళలు సొంతంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళలపై ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించిన ఈ పట్టాలను వారికి ఈ పత్రాలను అందజేశామన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు అందజేసిన ఇలాంటి ముఖ్యమంత్రి గెలిపించుకొని తెల్లవారు జామునే వృద్ధుల ఇంటివద్దకే రూ.3వేలు, అమ్మఒడి, రైతు భరోసా, విద్యార్థులకు వసతి దీవెన, మరెన్నో పథకాలు పొందాలని ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలో రూ.11లక్షల 45వేల సిఎం రిలీఫ్ చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు ఎంఎల్ఎ చేతులమీదుగా అందజేశారు. లబ్ధిదారులు లేటి విజయలక్ష్మి రూ.65వేలు, కరేటి సునీత రూ.10లక్షలు, కప్పల నవీన్ కుమార్ రూ.80వేల చెక్కులను అందజేశారు.

విపిఆర్‌ను కలిసిన మురళీకన్నబాబు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆత్మకూరు నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం నెల్లూరులోని వి.పి.ఆర్. నివాసానికి చేరుకుని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వేమిరెడ్డితో పలు విషయాలపై చర్చించారు.

పలుచోట్ల 'పల్స్ పోలియో'



మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలం బ్రాహ్మణపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పోలియో నివారణకు ఏకైక మార్గం టీకా, ఓరల్ పోలియో వ్యాక్సిన్ అని, 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు వైద్యారోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. ఆయనవెంట వైద్యసిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జక్కపల్లి గూడూరు సర్పంచ్ బండ్ల సురేష్ గౌడ్ పేర్కొన్నారు. మార్చి మూడో తారీకు పల్స్ పోలియో దినోత్సవ సందర్భంగా బోగోలు మండలం జక్కపల్లి గూడూరు పంచాయతీ లోని పిల్లలకు పోలియో చుక్కలను సర్పంచ్ బండ్ల సురేష్ గౌడ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయడం ద్వారా వారు ఆరోగ్యంగా ఎదుగుతారని, ప్రభుత్వం పోలియో చుక్కలను వేసేందుకు బస్టాండ్లలో రైల్వేస్టేషన్లో పాఠశాలలలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 98.59 శాతంగా విజయవంతమైందని డాక్టర్ శివకల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమంలో బూతులు ట్రాన్సిస్టర్ మొబైల్ టీముల ద్వారా 0-5 వయస్సు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశామన్నారు. మండలంలో 3605మంది చిన్నారులకు గానూ 3554మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మండలంలోకి వివిధ ప్రాంతాల నుండి వలసలు వచ్చి పనులు చేసుకుంటున్నా కుటుంబాల చిన్నారి ప్రత్యేక వారికి టీకాలు అందించడంపై వారి కుటుంబాలు వైద్యులు శివ కల్పనకు కృతజ్ఞతలు తెలిపారు. 4, 5వ తేదీల్లో ఎవరైనా చిన్నారులు ఉంటే గ్రామాలకు వచ్చే సిబ్బంది వెళ్లి వేయించుకోవాలని సిబ్బంది కూడా సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక బి.వి. నగర్‌లోని కురుగంటి నారాయణమ్మ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే కమాండింగ్ ఆఫీసర్ ఉత్తర్వులు మేరకు కె.ఎన్.ఆర్. నగర పాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి నేవల్ యూనిట్ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ పాల్గొని హాజరైన చిన్నారులకు రెండు చుక్కల మందు వేసి మాట్లాడారు. ఈ కేంద్రంలో 375మంది చిన్నారుల లక్ష్యానికి గానూ 214మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి పల్స్ పోలియో కేంద్రానికి రాలేని చిన్నారులకు కూడా చుక్కల మందు వేసి 375మంది చిన్నారుల లక్ష్యాన్ని నూరు శాతం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో బి.వి.నగర్ సచివాలయం సిబ్బంది, వార్డ్ హెల్త్ సెక్రటరీ, ఎఎన్ఎం బి.లక్ష్మీ ప్రసన్న, ఆశా కార్యకర్తలు డి.గిరిజ, పి.హైమావతి, ఎస్‌కె.రిజ్వానా, పడారుపల్లి పట్టణ ఆరోగ్యం కేంద్రం నోడల్ ఆఫీసర్ వెంకటయ్య, ఎన్‌సిసి నేవల్ కేడేట్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని చిరమన పిహెచ్‌సి పరిధిలో 97శాతం పల్స్ పోలియో చుక్కల నమోదైనట్లు పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి రాణి తెలిపారు. ఈ మేరకు స్టేట్ అబ్జర్వర్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు, పిఎస్‌సి పరిధిలోని హసనాపురం గ్రామంలో ఆదివారం జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ టాలీ షీట్స్‌ను పరిశీలించి ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు, పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ఎఎస్‌పేటలో పిహెచ్‌సి పరిధిలో 0-5 సంవతరాలోపు 2313మంది చిన్నారులకు గాను 2265 మందికి పోలియో చుక్కలు వేసి 97.9శాతం నమోదైనట్లు పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ మంజులమ్మ తెలిపారు. మొత్తం 28 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగవినుత, డాక్టర్ సురేష్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. 97శాతం మంది చిన్నారులకు వైద్య ఆరోగ్య సిబ్బంది పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్య అధికారులు ఆయేషా, కరిష్మా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 38పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 3254 మంది చిన్నారులకు గానూ 3,162మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : పట్టణంలో దళిత వాడలలో పలు కేంద్రాలలో పోలియో నిర్మూలన కొరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు చేవూరు చిన్న తెలిపారు. ఈ శిబిరాలలో 12వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి చేవూరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలియో చుక్కలు వేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించారు. పోలియో చుక్కలు అందించే కేంద్రాల్లో తప్పని సరిగా అందరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని చేవూరు చిన్న కోరారు. కార్యక్రమంలో 15 వార్డ్ హెల్త్ సెక్రటరీ గోసాల విజయలక్ష్మి, ఎఎన్ఎం సౌందర్య, అంగన్‌వాడీ టీచర్ విజయలత, వలంటీర్లు అక్కిలగుంట మల్లేశ్వరీ, దావులూరి బాలచంద్ర, చేవూరు శశి కుమార్, వలంటీర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కేంద్ర రక్షణ శాఖ సలహాదారులు గుండ్రా సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహిమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పోలియో చుక్కల కేంద్రాన్ని కేంద్ర రక్షణశాఖ సలహాదారులు గుండ్రా సతీష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 5225 మంది చిన్నారులకు గానూ 5152 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ అనూష తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ షేక్ ఖాదర్ వలీ, డివిజన్ ప్రోగ్రాం అధికారి సుధీర్‌బాబు, మహిమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పి అనూష కుమారి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : నేషనల్ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం సీతారామపురం మండలంలో పోలియో కేంద్రాలలో టార్గెట్ 1979 పిల్లలకు గానూ 1954 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ ఎ.స్వప్న తెలిపారు. మండలం మొత్తం మీద 98.7శాతం పోలియో చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.భవ్యశ్రీ, ఎంపిహెచ్ఇఒ, ఎస్‌కె.అబ్దుల్ మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించి పల్స్ పోలియో కార్యక్రమం 100శాతం చుక్కలు చిన్నారులకు అందే విధంగా ఏర్పాటు చేశామని అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని అనంతసాగరం, కామిరెడ్డి పాడు, మంగుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను తనిఖీ చేశారు. 51పల్స్ పోలియో కేంద్రాల్లో 4020 మందికి చిన్నారులకు చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండల పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించారు. వైద్య అధికారి డాక్టర్ నవీన్ మాట్లాడుతూ మండలపరిధిలో 60కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో 5మొబైల్ కేంద్రాలు వాటి ద్వారా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కల్ని అందిస్తున్నామని తెలిపారు. ఎఎన్ఎం ప్రమీల, ఆశ వర్కర్ చిన్ని, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, మానస పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరం ఎస్‌సి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో జలదంకి, గట్టుపల్లి పిహెచ్‌సిల పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. జలదంకి పిహెచ్‌సి వైద్యులు ఏ శ్రీనివాసులు, గట్టుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు పద్మజ, అమీన్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసున్న పల్స్ పోలియో కేంద్రాన్ని డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, అశోక్ కుమార్, వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బస్టాండ్ సెంటర్లో వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సంగమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రవీంద్రబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఇంటూరి సౌజన్య

ఇంటూరి సతీమణి ప్రచారం

కందుకూరు : కందుకూరు 9వ వార్డు ఆది ఆంధ్ర కాలనీ లో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య 4వ రోజు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు..ముందుగా కాలనీ లోకి వచ్చిన ఇంటూరి సౌజన్య కు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు.మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బాబు షురిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని, చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా, ఇంటూరి నాగేశ్వరరావు ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మనకు, మన బిడ్డలందరికీ మంచి జరుగుతుందని అన్నారు.రాష్ట్రానికి రాజధాని లేకుండా ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ద్రోహం చేసిన విషయాన్ని అందరూ గుర్తు చేసుకోవాలన్నారు.ఈసారి కందుకూరులో తెలుగుదేశం పార్టీ తప్పక విజయం సాధిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, వార్డు అధ్యక్షుడు చేవూరి రమేష్ బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, వార్డులోని మహిళలు, పట్టణ మహిళా కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, ఇమ్మానియల్, పర్సు నాగేశ్వరరావు, మద్దాలి రమేష్ చదలవాడ దశరథ, పర్సు కోటయ్య, గోచిపాతల కొండయ్య, వంకాయలపాటి కోటేశ్వరరావు, చదలవాడ దావీదు, చదలబాట శీను, ఉచ్చులూరి సుబ్బారావు, చదలవాడ సురేంద్ర, దామా మల్లికార్జున, ధామ కోటేశ్వరరావు, ఆలా ప్రసాద్, కంచర్ల గోపి, అత్తోట మాల్యాద్రి ఇతర నాయకులు పాల్గొన్నారు.



మేకపాటి విజయానికి కృషి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లు రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం బెంగుళూరులో జరిగిని ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా, ఆయనతోపాటు సర్పంచ్ కల్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశంలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ్యపెట్టిన పథకాలే ప్రజలకు రక్ష అని అన్నారు. సిద్ధం సభలో నూతన మేనిఫెస్టో ప్రకటించనున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, ఉదయగిరి ఎంఎల్ఎగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఆత్మీయ సమావేశంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిధ్ధార్ధరెడ్డి, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నాణ్యంపల్లి హరీష్ కుమార్ యాదవ్, యువ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, నియోజకవర్గ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల పల్స్‌పోలియో

నెల్లూరు: స్థానిక ఉస్మాన్‌సాహెబ్‌పేట ప్రాంతంలోని షిరిడి సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ పి.వినీల రెడ్డి పాల్గొన్నారు. తల్లిదండ్రులకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించి అనంతరం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. సి.పి అండ్ పి.హెచ్.పి.డబ్ల్యు.ఏ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ గారు, పి.హెచ్.పి నాయకులు చిట్లూరి వీరయ్య ఉన్నారు.

గుడ్లూరు : మండలంలో 4984 మంది చిన్నారులకి పోలియో చుక్కల మందు సిబ్బంది వినియోగించారు. వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 35 రహదారులు వాహనాలు ద్వారా అన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరుకుని చుక్కల మందు విజయవంతంగా ఆదివారం వేశారు. డిఎంహెచ్వో డాక్టరు ప్రియం వద పలు పోలియో కేంద్రాలకు చేరుకొని తనిఖీలు నిర్వహించారు.


కందుకూరులో..


వలేటివారిపాలెంలో..

వలేటివారిపాలెం: వల్లేటివారిపాలెం మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో విజయవంతమైందని, మొత్తంగా 96.72 శాతం పోలియో కార్యక్రమం నమోదైనట్లు వైద్యాధికారి తెలిపారు . 15 గ్రామ సచివాలయాల్లో పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలు 3963 మందికి గాను 3835 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. వైద్యులు శ్రీని వాసులు, మణిదీపిక , శివ ఎఎన్ఎంలు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సర్పంచులు డేగ వెంకటేశ్వర్లు వీరపనిసతీష్ ఉన్నారు

కందుకూరు :పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కందుకూరు పటణ పరిధిలో 35 పోలియో బూతులు, ట్రాన్సిట్ (ఆర్టీసీ బస్టాండ్), మొబైల్ టీమ్ ద్వారా 5457 మంది పిల్లలకి పోలియో చుక్కలు విజయవంతంగా వేశారు. కందుకూరు ఏరియా ఆస్పత్రిలో సూపరిండెంట్ డాక్టర్ శకుంతల, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ యం.ప్రియం వద పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభించినారు. తూర్పు వడ్డిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ పి బ్యూలా గ్రేస్ , మాచవరం వైద్యాధికారులు డాక్టర్ జువే రియా భాను, డాక్టర్ రాకేష్ ,పిహెచ్‌యన్ పద్మావతి,శోభ,సుధాకర్ ఉన్నారు.

రామానాయుడుకు 'కాకర్ల' నివాళులు

ప్రజాశక్తి-కలిగిరి

సిద్ధనకొండూరు గ్రామస్తులు, మాజీ వింజమూరు సమితి అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రామానాయుడు మరణించగా ఉదయగిరి తెలుగుదేశం – జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ వారికి సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ టిడిపి సీనియర్ నేత, వింజమూరు సమితి మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ రామానాయుడు ఆకస్మిక మృతి బాధించింది. జొన్నలగడ్డ రామానాయుడు ఆకస్మిక మృతి టిడిపికి, ఉదయగిరి మెట్ట ప్రాంతానికి తీరని లోటు అని తెలిపారు. 1981– 87 వరకు వింజమూరు సమితి అధ్యక్షుడుగా సేవలను అందించారన్నారు. రామానాయుడు మృతితో క్రమశిక్షణ కలిగిన



ప్రజా నాయకుడిని టిడిపి కోల్పోయిందన్నారు. నిస్వార్థంగా నిజాయితీగా అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవ చేసిన గొప్ప నాయకుడు రామానాయుడు అని తెలిపారు.



ఆత్మీయ సమావేశంలో 'గండు సోదరులు'

ప్రజాశక్తి-జలదంకి : మేకపాటి రాజగోపాల్ రెడ్డి బెంగుళూరు వైట్ ఫీల్డ్‌లోని తన నివాస ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి మండలంలోని గోపన్నపాలెం గ్రామానికి చెందిన గుండు సోదరులు హాజరయ్యారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు గోపన్న పాలెం సర్పంచ్ గండు వెంకరెడ్డి ఆయన సోదరుడు జలదంకి మండల రైతు అధ్యక్షులు గండు కృష్ణారెడ్డిలు హాజరయ్యారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో వైసిపి ఘన విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించు కున్నట్లు గండు సోదరులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఆయన తనయుడు మేకపాటి అభినవ్ రెడ్డిలకు పూల బొకే లను అందజేసి ముందస్తు విజయ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, ముఖ్య అతిథులుగా పాల్గొని రాజ గోపాలరెడ్డి, విజయానికి దిశా నిర్దేశం చేసినట్లు గండు సోదరులు తెలిపారు.

'పది' విద్యార్థులకు కౌన్సిలింగ్



ప్రజాశక్తి-కావలి : కావలి గాయత్రి నగర్‌లో ఉన్న నలంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఆది వారం కౌన్సిలింగ్, గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మానసిక వైద్యులు కెరీర్ గైడెన్స్, కౌన్సిలర్ డాక్టర్ సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ పిల్లలకు పరీక్షపై ఉండే భయాందోళ నలు, సందేహాలను తొలగించి పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించారు. కార్యక్రమం లో భాగంగా నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎమ్‌డి మజహర్ విద్యార్థులందరూ కష్టపడి చదవాలని, మంచిమార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. నలంద విద్యా సంస్థల డైరెక్టర్ ఎమ్‌డి వసీం, నలంద గాయత్రీ నగర్ ప్రిన్సిపాల్ ఉమ, టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మెహర్తాజ్, ఈటెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ఫరీదా, కాన్సెప్ట్ ప్రిన్సిపాల్స్ షఫీ, జ్యోష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి -పొదలకూరు

జీతభత్యాలతో సంబంధం లేకుండా ప్రజా సేవలో భాగమైన వాలంటీర్ల సేవలు ఎనలేనివని పట్టణ వైసిపి నాయకులు సోమా భాస్కర్ అన్నారు. ఆదివారం శ్రామిక నగర్ అంకమ్మ గుడి వద్ద వాలంటీర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు శాలు వాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వాలంటీర్లు నిస్వార్ధ సేవలు అందించారన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం బ్రహ్మయ్య,జెడ్‌పిటిసి తెనాలి నిర్మల, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి,ఎంపిటిసి గంగవరపు లక్ష్మీ కళ్యాణీ, గుంటి శ్రీనివాసులు, వైస్ ఎంపిపి సోమా అరుణ, పెద్దమల్లు రమణారెడ్డి, మలిశెట్టి శివశంకర్, మొల బంటి శేఖర్ బాబు, ఊకోటి లక్ష్మీ నారాయణ, జయమూర్తి రెడ్డి, ఆకులూరు వెంకట అనురాధ ఉన్నారు.

పిఎం సూర్య ఘర్ స్కీమ్ ప్రయోజనం

- పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -నెల్లూరు : దేశావ్యాప్తంగా సోలార్ పవర్ వినియోగాన్ని మరింత పెంచేందుకు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తపాలా శాఖ నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాసులు పేర్కొనాన్రు. ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని స్టోన్ హౌస్ పేట, ఇందుకూరుపేట, మైపాడు, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, బుచ్చిరెడ్డి పాళెం, దువ్వూరు అన్నీ పోస్ట్ ఆఫీసుల్లో రూ.300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కి.. కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీయోజన పథకం రిజిస్ట్రేషన్లు చేయాలని తెలిపారు.మరిన్ని వివరాలకు సమీప పోస్ట్ ఆఫీసులో సంప్రదించగలరన్నారు.

బైక్ బోల్తాపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు

మద్యం సేవించి వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు మండలంలోని కాంచెరువు ఎస్‌టి కాలనీకి చెందిన జయంపు దుర్గయ్య (25) తోటల చెరువుపల్లి గ్రామంలో ఓ మామిడి తోటలో కాపుల దారిగా ఉంటుండగా అక్కడికి పామూరు నుండి మద్యం సేవించి బైక్‌పై వెళ్తుండగా గొల్లపల్లి గ్రామశివారులో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్న ఎస్ఐ కె.తిరుపతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు. మృతుడికి భార్య, ఒక బాబు, ఇద్దరు ఆడ పిల్లలున్నారు.

మహిళా రక్తదాతలకు సత్కారం



ప్రజాశక్తి-కావలి : సేవియర్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కావలి పట్టణంలోని యువ మహిళా రక్తదాతలు, మోటివేటర్లను ఘనంగా సత్కరించి మహిళల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవియర్స్ మహిళా విభాగం సభ్యులు సౌందర్య దీపిక మాట్లాడుతూ మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు మహిళా దినోత్సవం పురస్కరించుకొని వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మహిళా సాధికారిక, మహిళలకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన సదస్సులు, పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేవియర్ సభ్యులు దివ్య, శ్రావ్య, నవ్య, స్రవంతి, పూజిత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.